# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 27-09-2024 సంపుటి : 06 సంచిక : 03 పేజీలు : 8 వెల : రూ 3-00


## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి ముగ్గురికి గాయాలు

గన్నవరం చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. గన్నవరం పట్టణ శివారులో ఘటన జరిగింది. గురువారం తెల్లవారుజామున విశాఖపట్నం నుంచి వస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. మృతులు బాపట్ల జిల్లా కోటపాడుకు చెందిన మార్క్(25), మేరీ(38)గా గుర్తించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను విజయవాడ జీజీహెచ్ కు తరలించారు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

### ప్రభుత్వ మద్యంషాపులు రద్దు చేస్తూ ఆర్డినెన్స్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న మద్యంషాపుల ను రద్దు చేస్తూ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. వైఎస్సార్సీపీ హయాంలో మద్యం విక్రయాలను ప్రభుత్వమే చేపట్టేందుకు ఎక్సైజ్ చట్టాన్ని సవరించారు. ఈ విధానాన్ని మారుస్తూ ప్రభుత్వం రిటైల్ లిక్కర్ షాపులకు అనుమతిస్తూ



చట్ట సవరణ చేసింది. అక్టోబర్ 1 నుంచి కొత్త లిక్కర్ పాలసీ రాబోతుంది. ఇటీవల కొత్త లిక్కర్ పాలసీకి క్యాబినేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో టీడీపీ హయాంలో 2014-19 వరకు ఉన్న మళ్లీ పాత విధానంలోనే మద్యం దుకాణాల్లో లిక్కర్ విక్రయాలు జరపనున్నారు. మద్యం రిటైల్ వ్యాపారం మొత్తం ప్రైవేట్?కే అప్పగించనున్నారు. ప్రస్తుతానికి అసెంబ్లీ సమావేశాలు లేనందున ఆర్డినెన్స్ ద్వారా మద్యం షాపులను జారీ చేసింది. ఏపీ వ్యాప్తంగా 3396 వైన్ షాప్స్ ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గీత కార్మికులకు పది శాతం దుకాణాలు కేటాయించనున్నారు. మరో 396 దుకాణాలను అదనంగా నోటిఫై చేయనున్నారు.

# టీటీడీ ఈవోను కలిసిన నందిని మిల్క్ ప్రతినిధులు

తిరుపతి : కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ ప్రతినిధులు గురువారం టీటీడీ ఈవో జె.శ్యామలరావును మర్యాద పూ ర్వకంగా కలిశారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో కేఎంఎఫ్ ప్రతిని ధులు నందిని డైరీ ఉత్పత్తులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పిపిటి) ద్వారా వివరించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో గౌతమి, కేఎంఎఫ్ ఎండి ఎంకె జగదీష్, డైరెక్టర్లు రఘునందన్, రాజశేఖర్ మూర్తి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల తిరుమల లడ్డూ తయారీ లో కల్తీ నెయ్యి వాడినట్లు తేలడంతో ఈ అంశం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. లడ్డూ తయారికి ఉపయోగించే నెయ్యిని



టెండర్ ప్రక్రియ ద్వారా పలు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కర్ణాటకకు చెందిన నందిని డైరీ కూడా తిరుమలకు నెయ్యిని సరఫరా చేస్తుంది. ఈ సమయంలో నందిని డైరీ ప్రతినిధులు తిరుమల అధికారులను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తిరుమలకు స్వచ్ఛమైన నెయ్యిని సరఫరా చేస్తున్న తమ డైరీకి మరి కొన్ని టన్నుల నెయ్యి సరఫరాకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా టీటీడీని కోరినట్లు సమాచారం .

# ఉపాధి హామీ నిర్దేశిత పనులను పూర్తి చేయండి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 26 – మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, వంద రోజుల పనిదినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను గడువులోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవోలు, ఎపిడిలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 55 ఫారం పాండ్ల త్రవ్వకానికి గాను 42 పూర్తి చేశారని పెండింగ్ లో ఉన్న కొత్తపల్లి, బనగానపల్లి, ఉయ్యాలవాడ, మిడుతూరు మండలాల్లో మిగిలివున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. 427 పశుసంపద షెడ్లకు కేటాయించిన లక్ష్యానికి గాను 32 షెడ్లు పూర్తి చేశారని పాములపాడు, బనగానపల్లి, గడివేముల మండలాల్లో పెండింగ్ లో ఉన్న పశు సంపద షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేబర్ బడ్జెట్ మొబలైజేషన్ లో కొత్తపల్లి, ప్యాపిలి, డోన్, రుద్రవరం, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, ఔక్, కోవెలకుంట్ల, గోస్పాడు, మిడుతూరు తదితర మండలాలు లక్ష్యసాధనలో వెనుకబడి వున్నాయని నిర్దేశిత గడువులోగా ప్రగతి సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్లాంటేషన్ కు సంబంధించి వెలుగోడు, ప్యాపిలి, డోన్, బేతంచర్ల, సంజామల కొలిమిగుండ్ల, సిరివెళ్ల మండలాల్లో లక్ష్యాన్ని చేరుకోలేదని ఈ వారంలోగా ఈ వారంలో ప్రగతి సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి ఏపీడీలు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు.



# జనసేనలో చేరిన బాలినేని, సామినేని

### కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కళ్యాణ్



అమరావతి,సెప్టెంబర్26:వైసీపీకి ఇప్పటికే రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి సహా మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్యలు జనసేనలో చేరారు. మంగళగిరి జనసేన ప్రధాన కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి నాయకులను స్వాగతం పలికారు. ఈ ముగ్గురితో పాటు వైసీపీ కీలక నాయకులు జనసేన పార్టీలో చేరారు. విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు అవనపు విక్రమ్, అవనపు భావన, ప్రకాశం జిల్లాకు చెందిన యాదాల అశోక్ బాబు, నాగులుప్పలపాడు జడ్పీటీసీ యాదాల రత్నభారతి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు. కీలక నేతలు ఒకేసారి జనసేనలో చేరడంతో ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న వేళ.. కీలక నాయకులంతా వైసీపీని వీడి ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ముఖ్యంగా బాలినేని శ్రీనివాసరెడ్డి, కిలారు రోశయ్య, సామినేని ఉదయభాను వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా పనిచేశారు. బాలినేని మంత్రిగానూ పనిచేశారు. వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డితో బాలినేనికి బంధుత్వం ఉంది. అయినప్పటికీ వైసీపీ అధ్యక్షుడి తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బాలినేని ఆ పార్టీని కాదని జనసేనలో చేరినట్లు తెలుస్తోంది. బాలినేని, కిలారు, సామినేని బాటలోనే మరికొందరు నాయకులు పయనించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరో వారం రోజుల్లో కీలక నేతలు జగన్‌కు గుడ్‌బై చెప్పి జనసేనలో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజీనామా చేసిన నాయకులు సైతం టీడీపీ, జనసేనలో చేరతారంటూ ప్రచారం జరుగుతోంది. పార్టీని వీడుతున్న వారిని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఫలితం లేనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జగన్ వైఖరి నచ్చకపోవడంతోనే వీళ్లంతా పార్టీని వీడుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. కీలక నాయకులు పార్టీని వీడటంతో క్షేత్రస్థాయిలో కేడర్ సైతం జనసేనలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా కీలక నేతల అనుచరులు మొదట పార్టీలో చేరుతుండగా.. దశలవారీ ద్వితీయ శ్రేణి నాయకులను పార్టీలోకి తీసుకురానున్నట్లు చర్చ జరుగుతోంది. జనసేనలో వైసీపీ కీలక నాయకుల చేరిక నేపథ్యంలో మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. బాలినేని శ్రీనివాస రెడ్డి, సామినేని ఉదయభాను, కిలారు రోశయ్యతో పాటు వారి అనుచరులు భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ కార్యాలయం నిర్మాణ పనుల కారణంగా ఒక్కో నాయకుడి వెంట లోపలకు నలుగురిని మాత్రమే అనుమతించారు. భారీగా కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చిన తరుణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఎరుకుల కులస్తులు చరిత్రలో ఎవరికి తక్కువ కాదు.




( నెల్లూరు ,రాయలసీమ రక్షణ, సెప్టెంబర్ 26) ఏపీ గురుకుల సేవా సంఘం నెల్లూరు అధ్యక్షులు నల్లగొండ శివ ఆధ్వర్యంలో నెల్లూరు ప్రెస్ క్లబ్ లో నల్లగొండ శివ మాట్లాడుతూ కొంతమంది కించపరుస్తూ మాట్లాడుతున్నట్లు ఎరుకుల కులస్తులు చరిత్రలో ఎవరికీ తక్కువ కాదని కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవారి జాతకం చెప్పిన వారు ఎరుకులాలని గుర్తించాలని అన్నారు అట్లే వైద్యశాల లేని రోజుల్లో ఎరుకులను నాటు మందులు ఇచ్చే వాళ్ళని అట్లే ఎరుకల మంత్రసాని ఎంతో సులభముగా కాన్పులు చేసే వారిని అట్లే గురువు ద్రోణాచార్యుల కోసం బొటనవేలు సమర్పించిన ఏకలవ్యుడు ఎరుకుల కులమని గుర్తించాలన్నారు. తెలంగాణలో ఎరుకులను గుర్తించి ఎరుపుల కార్పొరేషన్ స్థాపించినట్లుగా ఆంధ్రప్రదేశ్ లో కూడా ఎరుకుల కార్పొరేషన్ స్థాపించాలని కోరారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన 20 పోస్టులలో గిరిజనులకు సంబంధించి ఒక ట్రైకర్ చైర్మన్ తో కలుపుతూ ఐదుగురు సభ్యులను నియమించారు ఐదుగురు సభ్యుల్లో ఒకరు కూడా ఎరుకుల కులస్తులు లేరని అందుకని ట్రైకర్లలో కూడా తమ కులస్తులను సభ్యులుగా చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్ట రమణయ్య,కట్టా రామారావు,బండి బుజ్జయ్య,నల్లగొండ వెంకయ్య,సుబ్బరాయుడు,రమేష్,శ్యాం నాగేశ్వరరావు,కట్ట రజిని పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల హుండీ లెక్కింపు.



శ్రీశైల ప్రతినిధి ఈరోజు (26.09 2024)న జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి 4,00,65,375/- నగదు రాబడిగా లభించింది. ఇందులో ఆలయ హుండీల ద్వారా రూ. 3,86,82,321/- లు మరియు అన్నప్రసాద వితరణ ఉండి ద్వారా 13,83,054/-లు (4,00,65,375/-) మొత్తము లభించాయి. కాగా అలా ఉండేలా రాబడిని భక్తులు గత 35 రోజుల్లో (22.08.2024 నుండి 25.09.2024) వరకు సమర్పించడం జరిగింది. అదేవిధంగా అన్నదానం ఉండి రాబడి మార్చి 12వ తేదీ నుండి సెప్టెంబరు 25వ తేదీ వరకు సమర్పించడం జరిగింది. అదేవిధంగా 488- యు.ఎస్.ఎ డాలర్లు 12 కువైట్ దినార్స్ 6000- యుగాండా షిలాంక్స్ 30- యుకె పౌండ్స్ 60- సింగపూర్ డాలర్స్ 20- హాంకాంగ్ డాలర్లు 10- యూరోస్ 20- మలేషియా రింగ్ గేట్స్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాలు నిఘా తో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి శ్రీ డి. పెద్దిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్. రమణమ్మ, పలు విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు,సిబ్బంది, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు..!!

విభారె న్యూస్ సెప్టెంబర్ 26 కర్నూలు జిల్లా ప్రతినిధి..కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే,మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు పరిగెల మురళీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ సమన్వయకర్త జి.రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గం అమరావతి నగర్, చిన్న పెండేకల్ నుంచి ఎం రాజగోపాల్ రావు మరియు రఘునాథ్ యాదవ్ లు వారి అనుచరవర్గంతో సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప,మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కాంగ్రెస్ నాయకులు పీజీ నరసింహులు యాదవ్, ఎం కాశీం వలి,మురళీ కృష్ణంరాజు,ఎస్ ప్రమీల మొదలగు నాయకులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 27-09-2024

## భారత్ కు బూస్టింగ్ ఇస్తున్న ఆర్థిక సంస్థలు

వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ఒకటి. అందులో ఆర్థికంగా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పుడు ఆర్థికంగా దేశం 5వ స్థానంలో ఉంది. మరో మూడు నుంచి నాలుగేళ్లలో 3వ స్థానానికి తీసుకెళ్తానని మోదీ హామీ ఇచ్చారు. భారత ఆర్థిక అభివృద్ధి వేగాన్ని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వరకు అన్ని ప్రపంచ సంస్థలు విశ్వసించాయి. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ కూడా ఈ జాబితాలో చేరి భారత్ (మూడీస్ ఇండియా జీడీపీ) జీడీపీ వృద్ధి అంచనాను పెంచింది. 2024 క్యాలెండర్ ఇయర్ లో భారత్ 7.1 శాతం వృద్ధిని సాధిస్తుందని మూడీస్ తెలిపింది. భారతదేశ జీడీపీ వృద్ధి అంచనాను మూడీస్ 7.1 శాతానికి సవరించింది. అంతకుముందు రేటింగ్ ఏజెన్సీ 6.8 శాతం అంచనా వేసింది. అలాగే, గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ తన కొత్త ఆసియా-పసిఫిక్ అవుట్ లుక్ లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి దేశ వృద్ధి అంచనాను 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచింది, 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. మూడీస్ అనలిటిక్స్ కొత్త నివేదికలో భారత్ లో ద్రవ్యోల్బణ రేటును కూడా ప్రస్తావించింది. మూడీస్ దేశ ఆర్థిక వృద్ధి అంచనాను 30 బేసిస్ పాయింట్లు సవరించగా.., భారత ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతం నుంచి 4.7 శాతానికి తగ్గించింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జూలై, ఆగస్ట్ లో ఆర్బీఐ నిర్దేశిత పరిధిలో 4 శాతం కంటే తక్కువగా ఉంది. రేటింగ్ ఏజెన్సీ ప్రకారం ఆర్థిక సంవత్సరం 2025-26లో భారతదేశంలో ద్రవ్యోల్బణం రేటు ఇప్పుడు వరుసగా 4.5 శాతం, 4.1 శాతంగా అంచనా వేయబడింది. మూడీస్ మాత్రమే కాదు, ప్రపంచ బ్యాంకు నుంచి ఐఎంఎఫ్, ఇతర అంతర్జాతీయ సంస్థలు కూడా భారత ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం కలిగి ఉన్నాయని, అందరూ దేశ జీడీపీ వృద్ధి అంచనాను పెంచారన్నారు. మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ వ్యయం, స్థిరాస్తిలో పెరిగిన దేశీయ పెట్టుబడులు, మెరుగైన రుతుపవనాల కారణంగా ప్రపంచ బ్యాంకు 2025 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7 శాతానికి పెంచగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి అంచనాను 20 బేసిస్ పాయింట్లు పెంచి 7 శాతానికి పెంచింది. భారత జీడీపీ వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ సవరించింది. 2024-25 ఆర్థిక ఏడాదిలో 7 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. గతంలో 6.6 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొన్న ప్రపంచబ్యాంక్.. తన అంచనాలను మార్పు చేసింది. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ ఆశించిన స్థాయిలో రికవరీ అవుతుండడమే దీనికి కారణమని విశ్లేషించింది. ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నా భారత్ ఆర్థికవ్యవస్థ రాణిస్తుందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి ఇటీవల భారత జీడీపీ వృద్ధి రేటు నెమ్మదించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం వెలువరించిన గణాంకాల ప్రకారం 6.7 శాతంగా నమోదైంది. ఎప్పుడో ఈ గణాంకాలు వెలువడాల్సిఉన్నా.. ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. ఇటీవల ఆర్బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష సమావేశంలో భారత్ తొలి త్రైమాసికంలో 7.1 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది. కానీ అంతకంటే తక్కువే నమోదైంది. ఈ క్రమంలోనే నొమురా పూర్తి ఏడాదికి వృద్ధి అంచనాలను 6.9 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించింది. గోల్డ్‌మాన్ శాక్స్, జేపీ మోర్గాన్ వంటి సంస్థలు 6.5 శాతంగా ఉండొచ్చని పేర్కొన్నాయి. ప్రపంచబ్యాంక్ మాత్రం 7 శాతం నమోదుకావొచ్చని పేర్కొంది. భారత్ తో పాటు ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీల విశ్వాసం కూడా భారత్ పైనే ఉంది. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి రేటు అంచనాను 6.8 శాతంగా ఏజెన్సీ కొనసాగించింది. దీనితో పాటు, అమెరికా పాలసీ రేటు తగ్గింపు తర్వాత దేశంలో రెపో రేటు తగ్గుతుందని అంచనా. అక్టోబర్ లో జరిగే ఎంపీసీ సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బీఐ) వడ్డీరేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చని ఎస్ అండ్ పీ తెలిపింది.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం

### టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 26 - పేదల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అన్నారు. గురువారం నాడు స్థానిక నందమూరి నగర్ నందు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా "ఇది మంచి ప్రభుత్వం" కరపత్రాలను, స్టిక్కర్లను ఎన్ఎండి ఫయాజ్ , మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. మెప్మా సీ ఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి. కలిసి స్థానిక నాయకులు, అధికారులు ప్రతి ఇంటికి అందించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభల్లో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ, 100 రోజులు పూర్తిచేసుకున్న ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకుంటుందని తెలిపారు. అక్టోబర్ 1 నుండి అర్హత కలిగిన పెన్షన్ దారులకు పెన్షన్ మంజూరు చేసేలా గ్రామ సభలు నిర్వహించి పెన్షన్ లబ్దిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో 37 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మరియు మాజీ కౌన్సిలర్ మామిడి ఉషారాణి , మామిడి నాగరాజు కుమార్ , నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్ , కౌన్సిలర్ నాగార్జున , తాటికొండ బుగ్గ రాముడు , ఉమాకాంతయ్య , లక్ష్మీనారాయణ , షేక్ షబ్బీర్ భాష , షేక్ ఖలీల్ భాషా , చంద్రశేఖర్ , దుర్గాప్రసాద్ , మరాఠీ సూరి , ప్రతాప్ రెడ్డి , శరత్ , అడ్వకేట్ బాబురావు , తాటికొండ మహేష్ , వెంకట స్వామి ,ఇమామ్ హుస్సేన్ , వడ్డే నాగేంద్ర , సత్యరాజు , రమేష్ రెడ్డి , దిలీప్ కుమార్ (ఢిల్లీ) , సౌభాగ్య , సుజాత , రాజేశ్వరి , మాధవి మరియు మున్సిపల్ సిబ్బంది , సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్మీ కంపోస్టు అకస్మిక తనిఖీ చేసిన కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 26 - రైతునగరం 22 వ వార్డు సచివాలయం వద్ద ఉన్న వర్మీ కంపోస్టు స్థలాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అక్రమించుకునేందుకు కొందరు భూ కబ్జా దారుల కన్ను పడినట్టు తెలుస్తోందని. కొంత భాగం పడగొట్టడానికి సిద్ధం చేసారని వాటిని గమనించిన సచివాలయ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో తనిఖీ చేసామన్నారు . వర్మీ కంపోస్టు గతంలో రైతునగరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేదని ఇప్పుడు రైతునగరం మున్సిపాల్టీ లో కలవడం జరిగిందన్నారు. దీని పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నూతన బాధ్యతలు చేపట్టిన కమిషనర్...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 25 డోన్ మున్సిపల్ కమిషనర్ గా ప్రసాద్ గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు



## అన్యాయాన్ని ఉపేక్షించేది లేదు

### కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపిఎస్..




విభారె న్యూస్ సెప్టెంబర్ 26 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఆర్థికంగా నష్టపోయిన బాధితుడికి సత్వర న్యాయం చేయాలి. శాంతిభద్రతల పరిరక్షణ కు గట్టి చర్యలు తీసుకోవాలి. కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్. జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన... కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పీ. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం జిల్లాలోని సబ్ డివిజన్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్,కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్ మాట్లాడుతూ...కర్నూలు,పత్తికొండ, ఆదోని,ఎమ్మిగనూరు సబ్ డివిజన్ లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో,పట్టణాలలో అల్లరి మూకలు,ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన వారి పై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా బైండోవర్ చేస్తూ వారి ప్రవర్తన పై భవిష్యత్తులో నిఘా ఉంచాలన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే రౌడీషీట్ లు నమోదు చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాబరీ,డెకాయిటి వంటి గ్రేవ్ కేసుల పై దర్యాప్తులు పకడ్బందీగా చేయాలన్నారు. కేసులు నమోదు చేసే విషయంలో నిజ నిర్ధారణ చేసుకోవాలన్నారు. బాధితుడికి న్యాయం చేయాలన్నారు. ప్రాపర్టీ,ఛీటింగ్, సైబర్ ఫ్రాడ్స్ కేసులలో ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. నిందితులను ట్రేస్ చేయాలన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలలోని నగదును సీజ్ చేయాలన్నారు. రికవరీ చేసిన మొత్తాన్ని బాధితులకు అందజేయాలన్నారు. డిస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలన్నారు. మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఘర్షణలు,గొడవలు జరగకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పోలీసుస్టేషన్ లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీసుస్టేషన్ ఆశ్రయించే వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా కాసే వారి పై కేసులు నమోదు చేయాలన్నారు. బెల్లం అమ్మే వారి పై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులలో మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు, విపత్తు నిర్వహణల పై , పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర శాఖల సమన్వయంతో పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డిఐజి ఆదేశాల తో శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. నేర నివారణే ప్రథమ ధ్యేయంగా పోలీసులు పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. లాంగ్ పెండింగ్ కేసుల గురించి సబ్ డివిజన్ ల వారీగా అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులకు, సిబ్బంది కి ప్రశంసా పత్రాలు,నగదు రివార్డులు జిల్లా ఎస్పీ అందజేశారు. ఇందులో...1 సిసియస్ పోలీసులకు కర్నూలు తాలూకా పియస్ పరిధిలో కాపర్ వైర్, ట్రాన్స్ ఫార్మర్ రికవరీ, ఆయిల్ దొంగతనం కేసులను గుర్తించడంలో, జిల్లాలోని ఇతర 23 కేసులలో నిందితులను గుర్తించడంలో ప్రతిభ కనబరచిన సిసియస్ పోలీసులు సిసియస్ సిఐ పి. శేషయ్య,హెడ్ కానిస్టేబుల్ ఎమ్ వి. శ్రీనివాసులు, కానిస్టేబుళ్ళు ఎస్. నాగరాజు,యు.దేవరాజు, జె.శేఖర్ 2)సైబర్ ల్యాబ్ పోలీసులకు కాపర్ వైర్, ట్రాన్స్ ఫార్మర్, మొబైల్స్ రికవరీ లో ప్రతిభ కనబరచిన సైబర్ ల్యాబ్ పోలీసులు.సిఐ శ్రీనివాసులు,కానిస్టేబుల్స్ రాజేశ్వర్ రెడ్డి,చాంద్ బాషా, దేవనాయుడు,పి. తిరుమలరావు,యు. వెంకటరాజు,కిరణ్ కుమార్,మహేశ్వర్ సింగ్. 3 కర్నూలు త్రీ టౌన్ చైన్ స్నాచింగ్ కేసు చేధించడంలో కర్నూలు మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు చేధించడంలో మంచి ప్రతిభ కనబరచిన కర్నూలు త్రీ టౌన్ సిఐ మురళీధర్ రెడ్డి,ఎస్సై మన్మథ విజయ్, కానిస్టేబుళ్ళు... రంగారావు,కిశోర్,వీరేష్, తిరుమలేష్.4 లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో ... మంచి ప్రతిభ కనబరచిన డిఎస్పీ వెంకట్రామయ్య, సిఐలు నాగరాజారావు, బి.మధుసుధన్ గౌడ్, రామయ్యనాయుడు. 5)వినాయకని మజ్జనం విధుల్లో ప్రతిభ కనబరచినస్పెషల్ బ్రాంచ్ వారికి, కమ్యూనికేషన్ పోలీసులకు,స్పెషల్ బ్రాంచ్ పోలీసులు...ఎస్సైలు హనుమంతు, వేణుగోపాలరాజు, ఎఎస్సైలు మౌలాలి, అజ్మతుల్లా, లక్ష్మీనారాయణ,వీరేంద్ర, ఈశ్వర్ రెడ్డి,అస్లాంభాషా. కమ్యూనికేషన్ సిఐ మనోహర్,హెడ్ కానిస్టేబుల్ పరమేష్. 6డిసిఆర్ బి పోలీసులకు. జిల్లా క్రైమ్ రికార్డులలో ప్రతిభ కనబరచిన వారిలో డిసిఆర్ బి సిఐ గుణ శేఖర్ బాబు, పోలీసులు ఫారుఖ్ భాషా, ఆచారి,బాబా, రామచంద్రుడు లకు ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు,డిఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి,సోమన్న, ఉపేంద్ర బాబు, శ్రీనివాసరావు,ట్రైనీ డిఎస్పీ ధీరజ్,సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## యువత సేవా మార్గంలో నడవాలి...

విభారి న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 26 నేటి యువత సేవా మార్గంలో నడవాలని, సమాజ హితం కోసం మంచి పనులు చేస్తూ పదిమందికి స్ఫూర్తిగా నిలవాలని డోన్ ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ వైద్యురాలు రమ్య శిల్ప అన్నారు. గురువారం నాడు పత్తికొండ మండలం బురుజుల గ్రామానికి చెందిన ఉపేంద్ర నాయుడు అక్క స్వర్గీయ ఉమాదేవి జ్ఞాపకార్థం స్ఫూర్తి సేవాసమితి ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమ్య శిల్ప స్ఫూర్తి సభ్యులతో దాత కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రి ప్రజలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా దాతలు స్ఫూర్తి సభ్యులు వారు అభినందించారు. అనంతరం పద్మావతి వృద్ధాశ్రమం, మరియు ఓబులాపురం కాశీనాయన సేవాశ్రమం, పట్టణ వీధుల్లో గల వృద్ధులకు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు మల్యాల సురేష్ నాయుడు, దాత ఉపేంద్ర మరియు అతని మిత్ర బృందం, స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు స్ఫూర్తి మధు, స్ఫూర్తి సభ్యులు రాము,



భాస్కర్, నారాయణస్వామి గొల్ల రాజు, సురేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు

# తిరుమల లడ్డూ.. మారింది...

తిరుమల, సెప్టెంబర్ 26, తిరుమల లడ్డు మారింది. నెయ్యిలో నాణ్యత లడ్డుతో పాటు శ్రీవారి అన్న ప్రసాదాల రుచిని మార్చింది. నెయ్యి కల్తీతో లడ్డు ప్రసాదం అపవిత్రం అయిందన్న దుమారం భక్తుల్లో ఆందోళనకు గురి చేయడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అలెర్ట్ అయ్యింది. శ్రీవారి మహా ప్రసాదంలో క్వాలిటీని పెంచింది. వెంకన్న ప్రసాదం మహా అద్భుతంగా ఉందన్న సంతృప్తిని కలిగించింది. తిరుమల లడ్డు.. మహా ప్రసాదంగా కోట్లాది మంది భక్తులు స్వీకరించే లడ్డూ రుచి ఎంతో మాధుర్యం. 310 ఏళ్లు నిండిన ఆ లడ్డు మాధుర్యం ఈ మధ్య కల్తీ నెయ్యితో రుచితప్పిందన్న భావన భక్తుల్లో బలంగా వినిపించింది. అమృత పదార్ధంగా భక్తిరస మాధుర్యాన్ని పంచుతున్న తిరుమల వెంకన్న లడ్డూ లోని నెయ్యి కల్తీ వ్యవహరమే ఇందుకు కారణం అయ్యింది. తిరుమల శ్రీవారి భక్తులకు ఎంతో ఇష్టమైన లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేకపోవడానికి నెయ్యి నే కారణమని తేలింది. దీంతో నెయ్యి నాణ్యతను పెంచడం ద్వారా మహా ప్రసాదంలో క్వాలిటీ తీసుకురావాలని టీటీడీ భావించింది. ఈ చర్యనే కాంట్రవర్సీ కారణం అయ్యిందివెంకన్న భక్తులకు అత్యంత ప్రీతి పాత్రమైన లడ్డు ప్రసాదం నాణ్యత పై భక్తుల నుంచి వస్తున్న విమర్శలకు చెక్ పెట్టే ప్రయత్నం చేసింది. శ్రీవారి దర్శనానికి ఎంత ప్రాధాన్యతనిస్తారో అంతే ప్రాధాన్యత ఇస్తున్న శ్రీవారి లడ్డు ప్రసాదం మహా ప్రసాదంగా భక్తులు భావించేలా చర్యలు చేపట్టింది. లడ్డు నాణ్యతపై భక్తుల నుంచి పిర్యాదులు, విమర్శలకు టీటీడీ చెక్ పెట్టే ప్రయత్నంలో సక్సెస్ అయింది. తిరుమలలో ప్రక్షాళన షురూ చేసిన సర్కార్ లడ్డు తయారీలో నాణ్యతకు పెద్ద పీట వేసింది. లడ్డు తయారీ కి వినియోగించే నెయ్యిలో నాణ్యత లేదని పోటు సిబ్బంది కూడా ఈవో దృష్టికి తీసుకుని రావడంతో నెయ్యి సరఫరా మారింది. నాణ్యత పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టిన టీటీడీ సమూల మార్పులు చేసింది. లడ్డు తయారీకి వినియోగించే ముడి సరుకులలో నాణ్యత తోపాటు స్వచ్ఛమైన నెయ్యి ని కొనుగోలు చేస్తోంది. లడ్డు రుచి, నాణ్యత ను నందిని నెయ్యితో పెంచింది. ఇలా తిరుమల లడ్డు, శ్రీవారి అన్న ప్రసాదాలు నాణ్యత, రుచి పై టీటీడీ మరింత ఫోకస్ పెట్టింది. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నెయ్యితో శ్రీవారి లడ్డు ప్రసాదాల్లో క్వాలిటీ పెంచిన టీటీడీ.. 10 లక్షల కేజీల నందిని నెయ్యి కొనుగోలుకు కేఎంఎఫ్ కు ఆర్డర్ ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం కర్ణాటక నుంచి తిరుపతికి నందిని నెయ్యి ట్యాంకర్ల ద్వారా చేరుతోంది. ఇలా భక్తకోటికి అమృత పదార్ధంగా భక్తి రసం ఆధ్వర్యంలో పంచుతున్న తిరుమల వెంకన్న లడ్డు కు దాదాపు 310 ఏళ్ల చరిత్ర ఉంది. 1715 లో తిరుమలేశుడికి శ్రీవారి ప్రసాదం అందుబాటులోకి రాగా 15వ శతాబ్దం నుంచే శ్రీవారి ప్రసాదం వడ భక్తుల కడుపు నింపేది. ఇలా శ్రీహరి ప్రసాదానికి ఎంతో ప్రాధాన్యత ఉండగా భక్తకోటికి ప్రీతిపాత్రమైన లడ్డూ నైవేద్యమంటే తిరుమలేశు నికీ కూడా ఎంతో ఇష్టమైనది. ఇలా శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని 1803లో అప్పటి మద్రాసు ప్రభుత్వం తొలిసారిగా ఆలయంలో బూందీ ప్రసాదాన్ని ఇవ్వడం ప్రారంభించింది. ఇదో చారిత్రక ఆధారం కాగా అప్పటి నుంచే ప్రసాదాలు కూడా విక్రయించే వారన్న ప్రచారం ఉంది. పల్లవుల కాలం నుంచే ప్రసాదాల పరంపర మొదలయ్యిందని చరిత్ర చెబుతోంది. అప్పట్లోనే శ్రీవారికి సంధి నివేదనలు గా నైవేద్య వేళలు ఖరారు కాగా ఈ సమయాల్లోనే భక్తులకు ప్రసాదాలు పంచేవారనీ తెలుస్తోంది. ఆ రోజుల్లో కొండమీద భోజన సదుపాయం లేకపోవడంతో ప్రసాదాలే భక్తుల ఆకలి తీర్చేవన్న



ప్రచారం కూడా ఉండగా భక్తులకు అందజేసే ప్రసాదాన్ని తిరుప్పొంగం ఆ తర్వాత సుఖీయం మనోహరపడి ఇలా ప్రసాదాలను ప్రవేశ పెట్టారు. వీటిలో వడ తప్ప మరేవీ ఎక్కువ రోజులు నిల్వ ఉండేవి కాక పోవడంతో వడకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. ఇక, 1940 నుంచే భక్తుల చేతికి లడ్డూ అందింది. 1933లో తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటైన తరువాత ఆలయంలో ప్రసాదాల వితరణ, విక్రయ కార్యక్రమాలను పెంచగా 1940 నుంచి బూందీని లడ్డుగా మార్చి భక్తులకు అందజేయడం అమల్లోకి వచ్చింది. లడ్డూల తయారీకి వాడాల్సిన సరుకుల మోతాదును దిట్టం అనే పేరుతో 1950లో తొలిసారిగా టీటీడీ ధర్మకర్తల మండలి ఖరారు చేసింది. దిట్టం పరిమాణాలను ఖరారు చేసిన టిటిడి ఆలయ అవసరాలతోపాటు పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా దిట్టాన్ని పెంచుతూ వస్తోంది. 2001లో సవరించిన దిట్టాన్ని అనుసరిస్తున్న టిటిడి లడ్డు ప్రసాదాన్ని తయారు చేస్తుంది. భక్తులకు మాధుర్యాన్ని అందించే లడ్డూ తయారీ కోసం చిన్న లడ్డూకు రూ. 48 వరకు ఖర్చు చేస్తున్న టీటీడీ రూ. 50 లకు విక్రయిస్తోంది. ఇక పోటులో దిట్టం ప్రకారం 5100 లడ్డూలు తయారు చేయడానికి మొత్తం 803 కేజీల ముడి సరుకును వినియోగిస్తున్న టీటీడీ ఆవు నెయ్యి 165 కేజీలు, శెనగపిండి 180 కేజీలు, చక్కెర 400 కేజీలు, ముంత మామిడిపప్పు 30 కేజీలు, ఎండుద్రాక్ష 18 కేజీలు, కలకండ 8 కేజీలు, యాలకులు 4 కిలోలు వినియోగిస్తోంది. టీటీడీ తయారు చేసే లడ్డూ మరెక్కడా తయారు చేయకుండా పేటెంట్ హక్కులు కూడా దక్కించుకుంది. భక్తులకు అందజేసే ఉచిత లడ్డు కాకుండా మూడు రకాల లడ్డూలను టిటిడి తయారు చేస్తోంది. రోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల నెయ్యిని వినియోగిస్తూ మూడు నుంచి మూడున్నర లక్షల లడ్డూలను తయారు చేస్తున్న పోటులో 600 మందిని సిబ్బంది గుమ గుమలాడే లడ్డు ప్రసాదాన్ని తయారు చేస్తోంది. 100 మంది కాంట్రాక్ట్ సిబ్బంది మరో 500 మంది శ్రీవైష్ణవులు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని, శ్రీవారికి నైవేద్యాలను సాంప్రదాయబద్ధంగా తయారు చేస్తున్నారు. ఇలా ఇప్పుడు లడ్డులో నాణ్యతను పెంచిన టిటిడి క్వాలిటీ నెయ్యి వాడటం లేదన్న ఆరోపణలకు చెక్ పెట్టింది. ఈ టెండరింగ్ ద్వారా స్వచ్ఛమైన నెయ్యిని ప్రొక్యూర్ చేసుకుంటున్న టీటీడీ ఏటా 5 వేలకు పైగా మెట్రిక్ టన్నుల నెయ్యిని వినియోగిస్తుంది. దీంతో లడ్డు తయారీలో నాణ్యతను పెంచిన టిటిడి ప్రతి నెల 1.10 కోట్ల లడ్డూలను భక్తులకు విక్రయిస్తోంది. ఏటా రూ 500 కోట్ల ఆదాయాన్ని గడిస్తోంది. దీంతో తిరుమల లడ్డూ ఎవర్గ్రీన్ అన్నట్లు కల్తీ వివాదానికి చెక్ పెట్టేలా నాణ్యతను పెంచడమే కాదు వెంకన్న ను దర్శించుకున్న భక్తులకు అడిగినన్ని లడ్డూలను అందుబాటులోకి తెచ్చింది. స్వచ్ఛమైన నెయ్యితో తయారవుతున్న లడ్డుకు మరింత ప్రాశాస్త్యాన్ని తీసుకురా గలిగింది. లడ్డూలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు కలిపారనే వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం భక్తులపై పడకుండా స్వచ్ఛమైన నేతి వాడకంతో శ్రీవారి మహా ప్రసాదం గుమగుమలాడేలా చేసింది. నిత్యం శ్రీవారిని సగటు రోజూ దర్శించుకునే 70 వేల మందికి పైగా భక్తుల మన్ననలు టీటీడీ పొందుతోంది. రోజువారీగా లడ్డూను కొనుగోలు చేస్తున్న భక్తకోటి నాణ్యత పెరిగిందన్న సంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ఒకవైపు తిరుమల లడ్డూ పై కల్తీ వివాదం నడుస్తుండగానే లడ్డూకు డిమాండ్ మాత్రం కొనసాగుతోంది. లడ్డూలో కల్తీ నెయ్యి, ప్రపంచ వ్యాప్తం గా చర్చకు దారితీసినా ప్రతిరోజూ దర్శనం కోసం వచ్చే కొండకు వచ్చే భక్తులు పెరుగుతున్నట్లే లడ్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఎప్పటిలాగే లడ్డూను కొనుగోలు భక్తుల రద్దీ కంటిన్యూ అవుతోంది. గత నాలుగు రోజుల్లో 14 లక్షలకు పైగా తిరుపతి లడ్డూలు భక్తులకు చేరాయి. సెప్టెంబర్ 19న 3.59 లక్షల లడ్డూలను విక్రయించినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఇక సెప్టెంబర్ 20న 3.17 లక్షలు, 21న 3.67 లక్షలు, 22న 3.60 లక్షల లడ్డూలు అమ్మకాలు జరిగాయి. ఇలా టీటీడీ గణాంకాలు ప్రకారం రోజువారీ సగటున దాదాపు 3.50 లక్షల లడ్డూలను భక్తులకు టీటీడీ విక్రస్తోంది. కల్తీ నెయ్యి వివాదం ఉన్నా ప్రస్తుతం స్వచ్ఛమైన నెయ్యితో తయారవుతున్న లడ్డూల అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపలేదన్న అభిప్రాయం భక్తుల కొనుగోలు స్పష్టం చేస్తోంది.

# జెత్వానీ కేసులో సజ్జల బుక్కైనట్టేనా

విజయవాడ, సెప్టెంబర్ 26, హీరోయిన్ జెత్వానీ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు నిండా మునిగిపోయే పరిస్థితి వచ్చింది. పరారీలో ఉన్న ఏ వన్ కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు డెహ్రాడూన్‌లో పట్టుకుని విజయవాడకు తీసుకు వచ్చి రిమాండ్ కు తరలించారు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. కుక్కల విద్యాసాగర్ తో కలిసి ఐపీఎస్‌లు కుట్ర పన్ని జెత్వానీపై తప్పుడు కేసులు పెట్టారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా ఎఫ్ఐఆర్లో ఆ ముగ్గురి పేర్లు చేర్చినప్పటికీ వారి మెడకు ఉచ్చు బిగుసుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే విద్యాసాగర్ కోసం ఆ ఐపీఎస్‌లు ఇదంతా చేయలేదని.. అప్పటి ప్రభుత్వ ముఖ్యసలహాదారు సజ్జల ప్రమేయంతోనే ఈ తతంగమంతా నడిచిందంటున్నారు. ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను డెహ్రాడూన్ నుంచి రైలులో అర్ధరాత్రి తీసుకొచ్చిన పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఈ క్రమంలోనే పోలీసులు రిమాండ్ రిపోర్ట్‌ని కోర్టుకు సమర్పించారు. ఆ రిపోర్ట్లో సీనియర్ ఐపీఎస్ అధికారులు పి.సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీని నిందితులుగా చేర్చారు. వారితో పాటు అప్పట్లో విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీగా పనిచేసిన హనుమంతురావు, ఇబ్రహీంపట్నం సీఐగా ఉన్న సత్యనారాయణలను కూడా నిందితులుగా చేర్చారు. విద్యాసాగర్‌తో అధికారులు కుమ్మక్కైనట్లు రిమాండ్ రిపోర్ట్లో వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ ఐదుగురిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. అయితే ఎఫ్ఐఆర్‌లో ఇంకా సీతారామాంజనేయులు , కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ పేర్లు చేర్చలేదు. నేడో, రేపో ఆ ముగ్గురి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చి అరెస్టులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అరెస్టు భయంతో ఐపీఎస్ అధికారి కాంతిరాణా టాటా ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. తనపై తప్పుడు కేసు పెట్టారని.. తాను జెత్వానీ విషయంలో నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించానని కాంతి రాణా టాటా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్నీ ఇంకా ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోలేదు. పి.సీతారామాంజనేయులు, కాంతి రాణా, విశాల్‌గున్నీ వై నేత కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై కాదంబరీ జెత్వానీని అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్ట్లో పేర్కొన్నారు. మరోవైపు కుక్కల విద్యాసాగర్‌కు వచ్చే నెల 4 వరకు జడ్జి రిమాండ్ విధించగా విజయవాడ సబ్ జైలుకు తరలించారు. అతడిని పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ముంబైకి చెందిన కాదంబరి జెత్వానీని గత ఫిబ్రవరిలో పోలీసులు అరెస్టు చేశారు. ఓ హీరోయిన్ ను అరెస్టు చేసి తీసుకు వచ్చినా ఎవరికీ తెలియదు. అత్యంత రహస్యంగా అరెస్టు చేసి తీసుకు వచ్చారు. దాదాపుగా నెలన్నర పాటు ఆమెను రిమాండ్ లో ఉంచారు. ఈ లోపు ముంబైలో ఆమె పారిశ్రామిక వేత్త జిందాల్‌పై పెట్టిన కేసులో.. పోలీసుల ఎదుట హాజరు కాలేకపోవడంతో ఆ కేసును కొట్టి వేశారు. ఇందు కోసమే ఆమెను అరెస్టు చేశారని.. జిందాల్‌ను రక్షించడం కోసం.. ఇదంతా చేశారన్న ఆరోపణలను జెత్వానీ చేస్తున్నారు. తనను అక్రమ కేసులో అరెస్టు చేసి వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. జెత్వానీపై కేసు నమోదు చేయడానికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తనకు తప్పుడు పత్రాలతో భూమి అమ్మారని కుక్కల విద్యాసాగర్ అప్పట్లో చేసిన ఫిర్యాదు మేరకు ఆమెను అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అసలు జెత్వానీ ఎవరికీ భూమి అమ్మకానికి పెట్టలేదని.. ఎవరికీ ఆమె డబ్బులివ్వలేదని తాజా విచారణలో తేలింది. ఆమెపై ఫిర్యాదులో కుక్కల విద్యాసాగర్ పేర్కొన్న వ్యక్తులే ఈ విషయాన్ని విచారణాధికారులకు చెప్పారు. తమకు జెత్వానీతో ఎలాంటి పరిచయం లేదని ఆమె .. స్థలం అమ్మజూపలేదని స్పష్టం చేశారు. ఇలా జెత్వానీపై తప్పుడు కేసు పెట్టడం కోసమే అందరూ కలిసి ఓ ముఠాగా ఏర్పడి వేధించారని తేలడంతో.. కేసులు పెట్టారు. అయితే జెత్వానీ లాంటి సెలబ్రిటీపై విద్యాసాగర్ కేసు పెట్టడం.. దానికి ఐపీఎస్‌లు సహకరించడం వెనుక అప్పటి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సలహాదారు సజ్జల రామక?ష్ణారెడ్డి పేరు ప్రధానంగా ఫోకస్ అవుతోంది. ముంబై పారిశ్రామికవేత్త జిందాల్ కోసం జగన్ ఆదేశాల మేరకే సజ్జల కాదంబరీ విషయంలో చక్రం తిప్పారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేసులో సమగ్ర విచారణ పూర్తైతే ముగ్గురు ఐపీఎస్‌లతో పాటు సజ్జల కూడా జైలు పాలు కావడం ఖాయమంటున్నారు.

## చిరుత పులిని పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు.

రాజమండ్రి,కడియం నర్సరీలో చిరుత తిరుగుతున్నట్లు స్థానిక రైతులు సమాచారంతో అటవీశాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి ఇవి చిరుత పులి పాదముద్రలుగా గుర్తించారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా అటవీ శాఖ అధికారిణి భరణి, కోనసీమ జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే జాగ్రత్తలు తెలిపారు. చిరుత సంచారం కలకలం రేపిందన్న వార్తల నేపథ్యంలో జిల్లా అటవీ శాఖాధికారులను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అటవీశాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరుతను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసాఇచ్చారు. అలాగే చిరుత కదలికలు గుర్తించేందుకు నర్సరీలలో 20 ట్రాప్ కెమెరాలను అమర్చారు. అలాగే రెండు బోనులలో చిరుతకు ఎరగా మేక పిల్లను, పందిని అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కాగా బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమీపంలో చిరుత పులి పాదముద్రల ద్వారా అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

## కువైట్ లో కడప మహిళకు కష్టాలు

కడప, తినేందుకు తిండి లేక, తలదాచుకునేందుకు ఆశ్రమం లేక తాను తన ఇద్దరు పసి పిల్లలు కలిసి కువైట్ లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమను కువైట్ నుండి ఇండియాకు రప్పించి కాపాడాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లను వేడుకుంటూ అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ మహిళ సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని రాజుల కాలనీ కి చెందిన షేక్ బీబీ (38) అనే మహిళ బతుకు తెరువు కోసం ఐదేళ్ల క్రితం గల్ఫ్ దేశమైన కువైట్ కు వెళ్ళింది. అక్కడ ఓ షేట్ ఇంట్లో పని మనిషిగా పనిచేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఆమెకు ఆ ఇంట్లో పని ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇంట్లో నుండి పరారీ అయి బయట తలదాచుకుంది. అక్కడ కడప జిల్లా మైదుకూరు కు చెందిన దస్తగిరి భాషా తో పరిచయం ఏర్పరచుకుంది. వీరి పరిచయం ప్రేమగా మారింది. ఇరువురు కువైట్ లోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని బయట పనులు చేసుకుంటూ అక్కడే సహజీవనం సాగిస్తూ వచ్చారు. వీరిద్దరికీ ఇద్దరు ఆడబిడ్డలు సంతానం కలిగారు. ఈ క్రమంలో ఓ రోజు పోలీసుల తనిఖీల్లో భాగంగా దస్తగిరి భాష మద్యం సేవించి పోలీసులకు పట్టుబడడంతో అతనికి పోలీసులు ఫింగర్ వేసి ఇండియాకు పంపి వేశారు. అప్పటి నుండి షేక్ బీబీ తన ఇద్దరు పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తినేందుకు తిండి లేక, చేతిలో డబ్బులు లేక, తలదాచుకునేందుకు ఆశ్రమం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండియాకు వచ్చేందుకు షేక్ బీబీ కి అకామ లేకపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి కువైట్ లో మరింత తీవ్ర ఇబ్బందులు పడుతుంది.

# దసరా తర్వాత సెకండ్ లిస్ట్..

విజయవాడ, సెప్టెంబర్ 26, నామినేటెడ్ పోస్టుల భర్తీకి తొలి అడుగు పడింది. 20 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లతో కలిపి 99 మందికి ఫస్ట్ బొనంజా ప్రకటించారు సీఎం చంద్రబాబు. ఇందులో జనసేనకు మూడు, బీజేపీకి ఒక కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించారు. ఐతే తొలి విడత జాబితాలో ఉంటారనుకున్న కొందరు ఆశావహులు పేర్లు మాత్రం కనిపించలేదు. ఎన్నికల్లో ఫస్ట్ మీకే ప్రాధాన్యమని అధినేత హామీ ఇచ్చిన ఆ నేతలు నెక్స్ లిస్టుకు ఎందుకు షిఫ్ట్ అయ్యారు? తొలి జాబితాలో కూడికలు తీసివేతలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం?..ఏపీలో పదవుల పందేరానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 20 కార్పొరేషన్లు, వాటి డైరెక్టర్లు కలిపి మొత్తం 99 మందికి ఫస్ట్ లిస్టులో పదవులు కట్టబెట్టారు సీఎం చంద్రబాబు. ఇందులో ముగ్గురు త్యాగరాజులుతోపాటు యువనేత లోకేశ్ పాదయాత్ర, ఆయన సొంత నియోజకవర్గం మంగళగిరిలో గట్టిగా పనిచేసిన నేతలకు ప్రాధాన్యం దక్కిందని చెబుతున్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడిన దామచర్ల సత్య వంటివారికి అగ్రతాంబూళమే దక్కిందని చెబుతున్నారు. ఇక సీనియర్లకు అవకాశం కల్పిస్తూనే జూనియర్లను ప్రోత్సహించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమిలో సమన్వయం కమిటీ నిర్ణయానికి తగ్గట్లు 20 మందితో ప్రకటించిన తొలిజాబితాలో జనసేన, బీజేపీ నేతలకు పదవులు దక్కాయి. ఐతే బీజేపీ కోటాలో పదవి దక్కించుకున్న లంకా దినకర్‌కు గతంలో టీడీపీతో అనుబంధం ఉండటం చర్చకు తావిస్తోంది. ఇక జనసేనకు కేటాయించిన మూడు చైర్మన్ పదవులు కీలకమైనవేనని చెబుతున్నారు. పట్టణాభివృద్ధి, చిన్న పరిశ్రమలు, పౌర సరఫరాలు వంటి ముఖ్యమైన కార్పొరేషన్లు జనసేన దక్కించుకుంది. ఆ పార్టీకి కేటాయించిన మూడు కార్పొరేషన్లలో ఒకటైన పౌర సరఫరాల కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ కూడా జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఉండటం విశేషం. ఇక తొలి జాబితా తర్వాత మరిన్ని పదవుల ప్రకటన త్వరలోనే ఉంటుందని, దసరాలోగా రెండో విడత పదవుల భర్తీ ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో చాలా మంది నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో గత ఎన్నికల్లో సీట్లు కోల్పోయిన 31 మంది టీడీపీ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని భావించారు. ముఖ్యంగా పిఠాపురం సీటు వదలుకున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, మైలవరం సీటును త్యాగం చేసిన మాజీ మంత్రి దేవినేని ఉమాకు తొలి అవకాశం దక్కుతుందని ప్రచారం జరిగింది. అదేవిధంగా టీటీడీ పాలకవర్గం నియామకం కూడా ముందు ఉంటుందని చెప్పారు. కానీ, తొలి జాబితాలో మాజీ మంత్రి దేవినేని ఉమాతోపాటు మాజీ ఎమ్మెల్యే వర్మకు అవకాశం దక్కలేదు. ఇక టీటీడీ బోర్డుపైనా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. తొలి జాబితాలో కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కని నేతలకు రెండో జాబితాలో అవకాశమిస్తారా? లేక మరేదైనా ప్రత్యామ్నాయం చూపుతారా? అనే చర్చ ఆసక్తికరంగా మారింది. మాజీ మంత్రి ఉమా, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, ఆలపాటి రాజా వంటివారు నామినేటెడ్ రేసులో ముందున్నారని వినిపించినా, లిస్టులో వారి పేర్లు లేకపోవడంతో పార్టీ శ్రేణులు అవాక్కయ్యాయి. పైగా మాజీ మంత్రి ఉమాకు కేటాయిస్తారని ప్రచారం జరిగిన ఆర్టీసీ చైర్మన్ పదవిని సీనియర్ నేత, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు కట్టబెట్టారు. దీంతో ఉమాకు ఎలాంటి ప్రాధాన్యమిస్తారనేదే పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో సీట్లు త్యాగం చేసిన వారిలో కర్రోతు బంగార్రాజు, పీలా గోవింద సత్యనారాయణ, మంతెన రామరాజులకు ప్రాధాన్యం దక్కడం విశేషంగా చెబుతున్నారు. మొత్తానికి తొలి జాబితా విడుదలైనా? ఆశావహులను మాత్రం సంతృప్త పరచలేకపోయిందనే కామెంట్లే వినిపిస్తున్నాయి. మొదటి జాబితాలో కీలకమైన కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించినప్పటికీ.. ఎవరూ ఊహించని నేతలు పదవులు దక్కించుకోవడమే కూటమిలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా పదవులు దక్కించుకున్న 16 మందిలో టీం లోకేశ్‌లో సభ్యులు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ఏదిఏమైనా పదవుల భర్తీ జాతర మొదలు కావడంతో కూటమి పార్టీల్లో సందడి కనిపిస్తోంది.

# ఎదురు తిరుగుతున్న వ్యూహం

తిరుమల సెప్టెంబర్ 26,తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద కల్తీ విషయంలో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ వ్యూహం మార్చారు. ఇప్పటి వరకూ నిజాలు తెలుసుకోవాలని ఆయన చాలా మందికి లేఖలు రాశారు. పార్టీ పరంగా ఇంకా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు. కానీ లడ్డూ లో కల్తీ జరగనే లేదు అన్న వాదన మాత్రం గట్టిగా వినిపిస్తున్నారు. అందు కోసం రకరకాల వాదనలతో తెరపైకి వస్తున్నారు. తాజాగా జగన్ స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయించారు. తిరుమలకు కాలి నడకన వెళ్లడంతో పాటు శనివారం ఆలయాల్లో పూజలు చేయాలని పార్టీ క్యాడర్ కు పిలుపునిచ్చారు. తిరుమల లడ్డూ ఇష్యూలో జగన్ అన్యమతస్తుడు కాబట్టే హిందూ సంప్రదాయాలు, సనాతన ధర్మం విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారని పైగా కించ పరుస్తున్నారని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఈ విషయంలో ఎదురుదాడికి వైసీపీ వ్యూహం సిద్ధం చేసుకుంది. చాలా రోజులుగా బయటకు రాని కొడాలి నాని వంటి వారితోనూ ప్రెస్‌మీట్లు పెట్టారు. కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కి పంపించామని కల్తీ జరగనే లేదని వాదించారు. అందరూ ఇదే వాదనతో తెరపైకి వస్తున్నారు. శనివారం ఆలయాల్లో పూజలు.. ఆ తర్వాత జగన్ తిరుమల పర్యటన తర్వాత మరంత అగ్రెసివ్ గా కల్తీ జరగలేదన్న వాదనను వినిపించాలనుకుంటున్నారు. మరోవైపు లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇవ్వడానికి అనేక రూల్స్ మార్చారని తేలింది. కనీస అర్హత లేకపోయినా.. రూల్స్ మార్చి ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. అలాగే ఆ డెయిరీ నెయ్యి కేంద్ర ఆరోగ్య శాఖ చేసిన పరీక్షల్లోనూ కల్తీగా తేలింది. వీటన్నింటిపై ఇప్పుడు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఆ సిట్ నివేదికలో అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి. అసలు నెయ్యి టెండర్ల వెనుక ఉన్నగోల్ మాల్.. ఆయా సంస్థలు నెయ్యిని ఎలా ప్రొక్యూర్ చేస్తాయి.. అసలు తిరుమలలో టెస్టింగ్ చేశారా లేదా అంటి విషయాలు అన్నీ వెలుగులోకి వస్తాయి. ఇవన్నీ తమకు ఇబ్బందికరంగా ఉంటాయని వైసీపీ గట్టిగా నమ్ముతోంది. అందుకే ఆ సిట్ ..చంద్రబాబు చెప్పిందే చెబుతుందని ముందుగానే ఖండిస్తున్నారు. కానీ దర్యాప్తు సంస్థలు చెప్పేదే ఫైనల్. వైసీపీ హయాంలో తిరుమలలో లెక్కలేనన్ని అవకతవకలు జరిగాయని ఇప్పటికే లీకులు వచ్చాయి. ఒక్క టీటీడీ చైర్మనే సగటున రోజుకు ఐదు వందల వరకూ వీఐపీ దర్శన టిక్కెట్లు కేటాయించారని.. నాలుగేళ్లలో మూడున్నర లక్షల మందికి దర్శన టిక్కెట్లు ఇచ్చారని అవన్నీ అమ్ముకున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పెద్దిరెడ్డి, రోజా ట్రావెల్స్ పేరుతో టిక్కెట్లు అమ్ముకున్నారు. అలాగే ఇతర వైసీపీ నేతలు కూడా అదే పని చేశారని అంటున్నారు. ఇక ఎన్నికలకు ముందు తిరుపతిలో పనులకు టీటీడీ నిధులు మళ్లించడం సహా అనేక అవకతవకలు బయటకు వచ్చాయని వాటన్నింటినీ ప్రభుత్వం టైం చూసి బయట పెడుతుందని అంటున్నారు.

## శ్రీశైల దేవస్థాన అన్నప్రసాద వితరణ కు, గో సంరక్షణ పథకానికి భక్తుల విరాళం..



విభారె న్యూస్ సెప్టెంబర్ 26 శ్రీశైలం...శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవాలయంలో ప్రతినిత్యం భక్తులకు జరిగే అన్న ప్రసాద వితరణకు గాను రు.1,00,100 లను, గో సంరక్షణ పథకానికి గాను రు.1,00,100 లను, ప్రాణదాన ట్రస్టుకు రు.1,00,100 లను హైదరాబాద్ వాస్తవ్యులు ఎ. రామాంజనేయులు వారు ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి హిమబిందుకు, చత్తీస్గడ్ వాస్తవ్యులు రు.1,11,100 లను అన్న ప్రసాద వితరణకు గాను బి. విజయ మౌనిక, బైలాలీ వారు సహాయ కమిషనర్ ఇ. చంద్రశేఖర రెడ్డికి అందజేయడం జరిగినది. భక్తులకు దేవాలయం వారు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి తగు రసీదులను, లడ్డు ప్రసాదాలను అందజేసి స్వామివారి శేష వస్త్రం, స్వామి అమ్మ వాళ్ళ చిత్రపటాలను అందజేశారు..

## మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగిరెడ్డి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం..



విభారె న్యూస్ న్యూస్ సెప్టెంబర్ 26 ఎమ్మిగనూరు. .గురువారం రోజు "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం మునిసిపల్ కమిషనర్ ఎన్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ఎం.యస్. నగర్ సచివాలయం నందు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ప్రజలు, ప్రజా నాయకులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్గీయ కోట్ల విజయ భాస్కరరెడ్డి వర్ధంతి...

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పరిగెల మురళీకృష్ణ..




విభారె న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 26..జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కళా వెంకట్రావ్ భవనం నందు నేడు ఉదయం 10:30 గంటలకు మాజి ముఖ్యమంత్రి వర్యులు స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి 23వ వర్ధంతి కార్యక్రమము జరుగునని గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పరిగెల మురళీ కృష్ణ తెలియజేశారు.ముందుగా తుంగభద్ర నది తీరాన గల కిసాన్ ఘాట్ నందలి స్వర్గీయ కోట్ల విజయభాస్కర రెడ్డి సమాధిని దర్శించి పూలమాలు వేసి నివాళులర్పించుట అనంతరం కోట్ల సర్కిల్ టపాత పోలీసు కంట్రోల్ రూమ్ఊ వద్ద గల కోట్ల విజయ భాస్కర రెడ్డి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేయుట, పార్టీ కార్యాలయంలో విజయభాస్కర రెడ్డి చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం కార్యకర్తల సమావేశం జరుగునని ఈ కార్యక్రమమునకు జిల్లా కాంగ్రెస్ నాయకులు, కర్నూల్ సిటీ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థలయిన జిల్లా మహిళా కాంగ్రెస్, ఐ ఎన్ టి యు సి, ఎన్ ఎస్ యు ఐ, బిసి, ఓబిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ సెల్, లీగల్ సెల్, డాక్టర్ సెల్, కిసాన్ సెల్, సేవాదళ్, సాంస్కృతిక విభాగాల అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు హాజరు కావలసిందిగా మురళీకృష్ణ తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వం అధికారంలోకి వంద రోజుల ఇంటింటి ప్రచారం :- వేల్పులగోపాల్





విభారే న్యూస్. ఆగస్టు 26 కర్నూల్ ప్రతినిధికర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ కర్నూలు రూరల్ మండలం నగరంలో 38 39 40 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులలో నిర్వహించిన సంస్మరణ బాగంగా ఇంటి ఇంటిటి ప్రజారా కార్యక్రమంలో బిజెపి కోడుమూరు అసెంబ్లీ వేల్పులగోపాల్ కర్నూలు సిటి రైల్వే బోర్డు నెంబర్ బెస్తఈరన్న రాఘవఆచారి సచివాలయం సిబ్బంది ఎస్ ఎస్ రాజశేఖర్ సంక్షేమ శాఖ కార్యదర్శి దాబియా సుల్తాన మహిళ రక్షణ, మౌనిక అడ్మిన్ మెలినా క్వీన్ ఎమినిటీస్ సెక్రటరీ బొడెమ్మ ఎ యన్ యం సెక్రటరీ తదితరులు పాల్గొని వంద రోజుల ప్రభుత్వం ఏర్పాటు అయిన సందర్భంగా వారి సంక్షేమ సంక్షేమ పథకాలను ఉచిత సిలిండర్లు డీఎస్సీ ల్యాండ్ యాక్ట్ తదితర సంక్షేమ పథకాలను అమలు చేసిన భారత ప్రధాని శ్రీనరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి దగ్గుపాటి పురందేశ్వరి శ్రీనారచంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి శ్రీపవన్ కళ్యాణ్ ధన్యవాదములు తెలుపుతున్నారు.

# డి.ఎం. బి అమర్నాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ,పరిసరాల శుభ్రత..



విభారె న్యూస్ సెప్టెంబర్ 26 ఎమ్మిగనూరు..స్థానిక ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపోలో గురువారం (26/09/24) నాడు ఉద్యోగులంతా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగాఉద్యోగులంతాకలిసిఎమ్మిగనూరు శాసనసభ్యులు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. వి.జయ నాగేశ్వర్ రెడ్డి స్వచ్ఛత లో భాగంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించిన చోట శ్రమదానం చేసి చెట్లు నాటిన డిపో మేనేజర్ బి అమర్నాథ్ తో పాటు అకౌంట్స్ ఆఫీసర్ కుమార్, మెకానికల్ ఫోర్ మెన్ బాల ఆంజనేయులు,నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎంఎస్ వాసులు,ఎల్.హెచ్. గంగన్న ,రికార్డ్ ట్రేసర్ శ్రీమతి ముంతాజ్ లు చెట్లు నాటారు. ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ బి అమర్నాథ్ సారథ్యం వహించి స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతను అనుసరించి మేము స్వచ్ఛత కొరకు కట్టుబడి ఉంటామని, అందుకొరకు మా సమయాన్ని అంకితబద్ధం చేస్తామని, సంవత్సరానికి 100 గంటలు అంటే వారానికి రెండు గంటలు చొప్పున పరిశుభ్రత కొరకు స్వచ్ఛందంగా పాటుపడతామని, బహిరంగ ప్రదేశాల్లో చత్తవెయ్యము, ఇతరులతో వెయ్యనీయమని, పరిశుభ్రత అన్నది దైవంతో సమానమని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుటకు తమ వంతు కృషి చేస్తూ అందులో భాగంగానే మాకు గవర్నమెంట్ వారు ఇచ్చిన విధంగా డిపోలోని టాయిలెట్లను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించి బస్టాండ్ పరిసర ప్రాంతంలో బాదం చెట్లు నాటి ఉద్యోగులతో ఉదయం 10 గంటలకు ప్రతిజ్ఞ చేయించి శ్రమదానం చేశారు.ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రవాణా విభాగం అయిన ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపోలో "స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు" సెప్టెంబర్ 17 వ తారీకు నుండి అక్టోబర్ 1వ తారీకు వరకు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో అందరూ ఉద్యోగులు పాల్గొని తమ ఇంటి పక్కన ముందు ఎటువంటి చెత్త వేయకుండా తమ వంతు కృషిగా చేయాలని ఈ సందర్భంగా డిపో మేనేజర్ కోరారు.స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత పరిసరాల స్వచ్ఛత శుభ్రత మనందరి బాధ్యతగా భావించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ యూనియన్ తరపున పాణ్యం నుండి బాదాం చెట్లను తెప్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎమ్మెస్ వాసులు, బసవరాజు,శ్రీరాములు,ఏ డి సి ఎన్. పి.ఎం. సాహెబ్, గంగన్న ,చాంద్ భాషా, రిటైర్డ్ ఎంప్లాయిన్ సెక్రెటరీ నారాయణ, సిఎండి దావూద్,యు.గోపాల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గత ఐదు రోజులుగా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 26 - నంద్యాల జిల్లా ఎస్పీ అధిరా జ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలో నేరానివారనే లక్ష్యంగా విజిబుల్ పోలిసింగ్, ఎన్ఫోర్స్మెంట్ పనులు జరగా లని ఆదేశాలమేరకు నంద్యాల జిల్లాలో అన్నీ పోలీసు స్టేషన్ పరిదులలో 21తేది నుంచి 25 వరకు పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మట్కా,జూదము,అక్రమ మధ్యం,ఇసుక ,డ్రంకన్ అండ్ డ్రైవ్,రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ విహికల్ ఆక్ట్ ను కట్టుదిట్టంగా అమలు చెయ్యడం మొదలగు వాటిని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా జిల్లాలో నంద్యాల జిల్లాలోని అన్నీ పోలీసు స్టేషన్ పరిధిలలో గల అదికారులు వారి సిబ్బంది సహాయంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టగా మొత్తం 92 కేసులు నమోదు చేసి 64 వాహనాలు సీజ్ చెయ్యడం జరిగిందన్నారు . ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా 417 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయడం జరిగిందని . మరియు జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయుచున్న 240 మందిపై కేసులు నమోదు చేసి 21,280 జరిమానా విధించడం జరిగింది.జిల్లాలో మోటార్ వెహికల్ చట్టం అమలుచేస్తు 2332 కేసులు నమోదు చేసి 10,77,093/- రూ. జరిమాన విదించడం జరిగిందన్నారు .నంద్యాల జిల్లా డోన్ సబ్ డివిజన్ పరిదిలో కోడి పందాలు ఆడుచున్న 07 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 4500/- రూ,04 మోటార్ సైకల్లు,02 పందెం కోళ్ళు,06 కోడి పందాలకు ఉపయోగించే కత్తులు స్వాదినం చేసుకోవడం జరిగిందని . జిల్లాలో పేకాట ఆడుచున్న వారిపై దాడి చేసి 06 కేసులు నమోదు చేసి 48 మందిని అరెస్ట్ చేసి 1,21,680/- రూ. స్వాదినం చేసుకోవడం జరిగిందని అన్నారు .జిల్లాలో ఎన్ఫోర్స్మెంట్ పనులలో భాగంగా జిల్లా పోలీసు అదికారులు నాటు సారా స్థావరాలపై మరియు విక్రయదారులపై దాడి చేసి 33 కేసులు నమోదు చెయ్యడం తోపాటు 481 (180 ఎమ్ ఎల్ ) బాటిళ్లను (సుమారు 25.2 లీటర్లు),165 లీటర్ల నాటు సారాయిని, స్వాదినం చేసుకోవడంతో పాటు 37 మందిని అరెస్ట్ చెయ్యడం జరిగిందన్నారు .



## మొక్కలు నాటిన వృక్షయజ్ఞం కమిటీ సభ్యులు...





ఆళ్ళ గడ్డ విభారె న్యూస్ ఆళ్లగడ్డ సెప్టెంబర్ 26 :- ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ భారతి విద్యా మందిరం బ్రాంచ్ పాఠశాలలో గురువారం వృక్ష యజ్ఞం సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. వృక్షయజ్ఞం సొసైటీ వ్యవస్థాపకురాలు లావణ్య , అపుస్మ సంఘం అధ్యక్షుడు, వృక్షయజ్ఞం సొసైటీ ప్రధాన కార్యదర్శి అమీర్ భాష ఆధ్వర్యంలో సంఘం సభ్యులు మొక్కలు నాటారు.ఈసందర్భంగాసొసైటీ ఫౌండర్ లావణ్య మాట్లాడుతూ వృక్షయజ్ఞం సంస్థను స్థాపించి గత నాలుగు సంవత్సరాలుగా విరివిగా కార్యక్రమాలు చేపట్టి పలుచోట్ల చెట్లను నాటడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అలాగే మొక్కలను దానం చేయడం కూడా ఎంతో పుణ్యప్రదమన్నారు. ఆళ్లగడ్డలో తమ సంస్థ చేపట్టిన కార్యక్రమానికి సహకారం అందిస్తున్న సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అమీర్ భాష మాట్లాడుతూ పచ్చని చెట్లు .. ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వృక్ష యజ్ఞం సేవాసంస్థ కోశాధికారిహరిప్రియ, శ్రీ భారతి విద్యా మందిరం ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది, సంఘ సభ్యులు వెంకటేశ్వరమ్మ, దివ్య తదితరులు పాల్గొన్నారు.


## చిన్నారి మోక్షిత్ కు వైద్య సహాయం ........



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :-సెప్టెంబర్ 25 డోన్ ఆటో నగర్ లో నివసిస్తున్న మహేష్ బాబు,పద్మావతి ల కుమారుడు చిన్నారి మోక్షిత్ ఈనెల వెల్దుర్తి మండలం మాదార్ పురం దగ్గర రోడ్డు ప్రమాదంలో గాయపడంతో శస్త్ర చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ద్రోణాచలం సేవా సమితిని సైనికులు విరాళాల రూపంలో సేకరించిన 116385 /- రూపాయల చెక్కును డోన్ తాసిల్దార్ నాగమణి చేతుల మీదుగా సమైక్యంద్రకట్ట దగ్గర గురువారం మోక్షిత్ తల్లి, తండ్రు లకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు, ద్రోణాచలం సేవా సైనికులు షాదీఖాన రాజా, గురు స్వామి, పానీపూరి మురళి, తాహెర్, కేరళ రఫీ, రమణ మాస్టర్, ఫయాజ్ , సుధాకర్ బాబా, షబ్బీర్, మనోజ్ లు పాల్గొన్నారు.

## నంద్యాలలో టీడీపీ ఫ్లెక్సీ చించివేత

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 26 - నంద్యాల నందమూరి నగర్లో గురువారం మంత్రి, కలెక్టర్ ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో వార్డు ఇన్చార్జి శివనాగిరెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను చించివేయడం స్థానికంగా కలకలం రేపింది. శివనాగిరెడ్డి గురువారం ఓ ప్రకటన లో మాట్లాడుతూ వైయస్ నగర్ లో. నందమూరి నగర్లో గత పాలకులు నిర్లక్ష్యం వల్ల రోడ్డు గుంతలు ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ సూచనల మేరకు క్రషర్ల నుంచి తెచ్చిన కంకరతో గోతులను పూడ్చాను. పైపు లైన్ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు . నాఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు ఈ సంఘటనకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు , వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190